నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, మంగళవారం 29 అక్టోబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



భూపాలపల్లిలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలు

# ఒక్కరు పోయి.. ఇద్దరయ్యారు!

## భూపాలపల్లిలో పటాకుల వ్యాపారం వారి కనుసన్నల్లోనే..

- ఒక్కో షాపు నుంచి రూ. 20,500 చొప్పున రూ. 5.33 లక్షలు వసూలు
- అన్ని అనుమతుల బాధ్యత వారిదే..
- అధికారులకు తెలిసే జరుగుతున్న తంతు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : దీపావళి పండుగ సందర్భంగా భూపాలపల్లిలో ఏటా ఒకరి కనుసన్నల్లోనే దుకాణాలు ఏర్పాటయ్యేవి. అన్ని అనుమతులు తీసుకునే బాధ్యత అతడే తీసుకునేవాడు. ఇందుకోసం వ్యాపారుల నుంచి కొంత మొత్తం తీసుకునేవాడు. ఇప్పుడు పరిస్థితి మారింది. అతడికి మరొకరు జత కలిశారు. ఈ సారి అన్నీ తానే చూసుకుంటానని బాణసంచా వ్యాపారి వచ్చి చేరాడు. నాకే డబ్బులివ్వాలంటూ జులుం ప్రదర్శించాడు. దీంతో ఈ వ్యవహారం రచ్చకెక్కింది. ఇప్పుడు ఇద్దరు కలిసి ఒక్కో షాపు నుంచి రూ. 20,500 ముక్కు పిండి మరీ వసూలు చేసినట్లు వ్యాపారులే చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 26 షాపులకు రూ.5.33 లక్షలు సదరు వ్యక్తులకు అప్పగించినట్లు సమాచారం. వీరి షాపులకు సంబంధించిన అనుమతులన్నీ వారే తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ సొంతంగా దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవడానికి కుదరదు. డబ్బులు కట్టకుంటే దుకాణం ఎత్తేయాల్సిందేనని వ్యాపారులు వాపోతున్నారు.

**45 దుకాణాలకే అనుమతి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45 పటాకుల దుకాణాల ఏర్పాటుకు మాత్రమే అధికారులు అనుమతి ఇచ్చారు. ఇందులో జిల్లా కేంద్రంలోనే 26 షాపులున్నాయి. చిట్యాల, మహదేవపూర్, కాటారంలో మినహా ఎక్కడ కూడా షాపులకు అనుమతులు లేవు. జిల్లా కేంద్రంలో ఒకే చోట దుకాణాలను పైరవీకారులు నిబంధనలకు విరుద్ధంగా ముగ్గుపోసి ఏర్పాటు చేయించారు. దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో రూ. 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం అగ్నిమాపక శాఖతో పాటు పోలీసు, విద్యుత్, తూనికలు, కొలతల శాఖల అనుమతి పొందాలి. అయితే ఇక్కడ ఈ అనుమతులన్నీ డబ్బులు తీసుకొని ఆ ఇద్దరే తీసుకొస్తున్నారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా కర్రలతో షెడ్లను ఏర్పాటు చేశారు. దుకాణాల సమీపంలో ఇసుక బకెట్లు, నీళ్ల ట్యాంకర్లు ఏర్పాటు చేయలేదు. అయినా అధికారులు ఎలా అనుమతిచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**మా దృష్టికి రాలేదు**

భూపాలపల్లిలో పటాకుల దుకాణాల వ్యాపారుల నుంచి ఇద్దరు వ్యక్తులు డబ్బులు వసూలు చేసిన విషయం మా దృష్టికి రాలేదు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు పరిశీలించి, వారు ఏర్పాటు చేసుకున్న షెడ్లను, సేఫ్టీని చూసి అనుమతులు ఇస్తాం. డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

– కుమారస్వామి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్

## అగ్ని ప్రమాదంతో కలత చెంది..
# బట్టల వ్యాపారి తండ్రి మృతి



లక్ష్మీనారాయణ(ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 28 : జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణం వ్యాపారి స్వర్గం శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణ (77) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో వారి బట్టల దుకాణం పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో తన చిన్న కుమారుడు శ్రీనివాస్ జీవనోపాధి దెబ్బతిని కుటుంబం రోడ్డుమీద పడడం, రూ.70 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లడంతో ఆవేదనకు గురైన లక్ష్మీనారాయణ గుండెపోటుకు గురైనట్లు బంధుమిత్రులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అతడి ఇంటికి చేరుకొని లక్ష్మీనారాయణ మృతదేహంపై పూలమాల వేసినివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.



కాకతీయ యూనివర్సిటీ

# కేయూలో కబ్జాలు నిజం..

{ 51 ఎకరాలు పరులపాలైనట్లు నివేదిక }

## భూముల అన్యాక్రాంతంపై నిగ్గు తేల్చిన విచారణ కమిటీ

- ఆరు నెలలైనా పట్టించుకోని ప్రభుత్వం
- కబ్జాదారులకు అండగా అధికార పార్టీ పెద్దలు
- వారి ఒత్తిడితోనే చర్యలకు వెనుకాడుతున్న బల్దియా అధికారులు
- బహిరంగ మార్కెట్లో భూమి విలువ రూ. 100 కోట్లు

కాకతీయ యూనివర్సిటీ (కేయూ) భూములు కబ్జాకు గురైంది వాస్తవమేనని ప్రభుత్వ సర్వే నిగ్గు తేల్చింది. ఇందుకు సంబంధించి సర్కారు నియమించిన విచారణ కమిటీ ఆరు నెలల క్రితమే నివేదిక సమర్పించింది. మొత్తం 51 ఎకరాలు పరులపాలైనట్లు అందులో పేర్కొంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ. 100 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం ఈ భూముల్లో యూనివర్సిటీ అధికారులు, పోలీసులు, రాజకీయ పార్టీ నేతలు దాదాపు 19 మంది దర్జాగా ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కబ్జాదారుల వైపు కన్నెత్తి చూడడం లేదు. పైగా అధికార పార్టీ పెద్దలే వారికి అండగా నిలుస్తున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా బల్దియా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. భూములు వెనక్కి తీసుకోకుండా అడ్డుపడుతున్నారు.

- వరంగల్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

వరంగల్‌లో కాకతీయ యూనివర్సిటీ (కేయూ)1976లో ఏర్పాటైంది. నగరంలోని కుమార్‌పల్లిలో 188 ఎకరాలు, లష్కర్ సింగారంలో 309.20, పలివేల్పుల శివారులో 175.14 చొప్పున 673.12 ఎకరాల భూమిని కేటాయించారు. ప్రధాన రహదారి వెంట మాత్రమే ప్రహరీ నిర్మించి, యూనివర్సిటీ వెనుక వైపు వదిలేయడంతో పలివేల్పుల, డబ్బాల ఏరియా, ముచ్చర్ల రోడ్డులో ఉన్న భూములు కబ్జాకు గురయ్యాయి. యూనివర్సిటీ అధికారులు, రాజకీయ పార్టీల నేతలు, పోలీసు అధికారులు దర్జాగా కబ్జా చేసి సర్వే నంబర్లలో స్వల్ప మార్పులు చేసి కాగితాలు సృష్టించారు. కేయూ భూముల కబ్జాపై ఆరోపణలు పెరగడంతో 2023లో హనుమకొండ కలెక్టర్ డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) పద్ధతిలో భూములను సర్వే చేయించగా ప్రస్తుతం 622.2 ఎకరాలే ఉన్నట్లు తేలింది. కేయూ క్యాంపస్‌లోని 229, 234, 412, 413, 414 సర్వే నంబర్లలోని 51 ఎకరాల భూమి కబ్జా అయినట్లు బయటపడింది. ఇందుకు సంబంధించిన నివేదికను ఆరు నెలల క్రితమే సర్కారుకు సమర్పించినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, ప్రొఫెసర్లు ధర్నాలు చేశారు. అయినా యూనివర్సిటీ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదు.

### రక్షణ లేని భూములు

కేయూ భూముల పరిరక్షణ విషయంలో ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. యూనివర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పనులు పూర్తి కాలేదు. విద్యార్థుల ఒత్తిడి పెరగడంతో ఇటీవల 229 సర్వే నంబర్‌లో పూర్తి సర్వే నిర్వహించి స్థానిక తహసీల్దార్ నివేదిక ఇచ్చారు. ఇందులోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు లేఖ రాశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో వారు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో 214 సర్వే నంబర్‌లోని భూములు, అక్రమ నిర్మాణాలను నిర్ధారించే సర్వేను సైతం నిలిపివేశారు. 412, 413, 414 సర్వే నంబర్లలో ఇంకా సర్వేను మొదలుపెట్టలేదు. తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వే పూర్తి చేసి నివేదిక ఇస్తేనే హద్దులు నిర్ణయించే అవకాశం ఉంటుంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో సర్వేకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రహరీ నిర్మాణం ముందుకు సాగడంలేదు. కేయూ భూములకు రక్షణ ఉండడంలేదు.

### సర్వే ఇంకా కొనసాగుతున్నది

కాకతీయ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం చేపట్టిన సర్వే ప్రస్తుతం ఆగిపోయింది. తిరిగి మళ్లీ కొనసాగుతుంది. లష్కర్‌సింగారంలో యూనివర్సిటీ భూములకు హద్దులు గుర్తించిప్పటికీ చర్యల విషయంలో మున్సిపల్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. యూనివర్సిటీకి చెందిన ఇంచు భూమిని కూడా వదిలిపెట్టేది లేదు. సర్వే లెక్క తేలిన తర్వాత భూములను స్వాధీనం చేసుకుంటాం.

- నాగవెల్లి వాసుదేవరెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి

**యూనివర్సిటీ భూముల వివరాలు**

| రెవెన్యూ పరిధి | రికార్డుల ప్రకారం | జీడీపీఎస్ సర్వే ప్రకారం |
|---|---|---|
| కుమార్‌పల్లి | 188.28 | 185.14 |
| లష్కర్ సింగారం | 309.20 | 293.39 |
| పలివేల్పుల | 175.14 | 142.27 |
| మొత్తం | 673.12 | 622.20 |



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

# పత్తి రైతు పరేషాన్

- మద్దతు ధర రూ. 7,521.. పలికింది రూ. 6,800
- అధికారులను నిలదీసిన అన్నదాతలు
- ఎనుమాముల మార్కెట్‌లో స్వల్ప ఉద్రిక్తత
- కొద్దిసేపు నిలిచిన క్రయ విక్రయాలు

కాశీబుగ్గ, అక్టోబర్ 28 : ఆరుగాలం కష్టపడి పండించిన పత్తికి మద్దతు దక్కకపోవడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ. 7,521 ఉండగా, సోమవారం ఎనుమాముల మార్కెట్‌లో రూ. 6,800 పలికింది. పత్తి కొనుగోలు ధర తగ్గడంతో ఆగ్రహానికి గురైన అన్నదాతలు మార్కెట్ కమిటీ అధికారులను నిలదీయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో క్రయ విక్రయాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. వెంటనే మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల రంగంలోకి దిగి రైతులకు పత్తి ధరలు తగ్గడంపై క్లుప్తంగా వివరించారు. అనంతరం యార్డులో సీసీఐ అధికారులతో రైతులకు అవగాహన కల్పించారు.

**తేమ 12 శాతం మించొద్దు..**

మార్కెట్‌కు తీసుకువచ్చే పత్తిలో తేమ శాతం అధికంగా ఉంటున్నదని సీసీఐ అధికారులతో పాటు కార్యదర్శి నిర్మల తెలిపారు. సీసీఐ కొనుగోలు చేయాలంటే తేమ కచ్చితంగా 8 నుంచి 12 శాతం వరకు ఉండాలని సూచించారు. ప్రస్తుతం పత్తిలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటున్నదని, దీంతో పత్తి నాణ్యతా ప్రమాణాలు దెబ్బతింటాయని తెలిపారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజలు, కాటన్ బెయిల్స్‌కు ధర పడిపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు కూడా తక్కువ ధరకే పత్తి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. తేమ 12 శాతం మించకుండా నాణ్యతా ప్రమాణాలతో తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. అలాగే రైతులు పత్తిని బస్తాల్లో కాకుండా వాహనాల్లో లూజుగా తీసుకొస్తే సీసీఐ కొనుగోలు చేస్తుందని అధికారులు తెలిపారు.

# అదనపు కలెక్టర్లు, ఆర్డీవోల బదిలీలు

- మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా మహేందర్‌జీ, భూపాలపల్లికి అశోక్‌కుమార్, ములుగుకు డేవిడ్

వరంగల్/మహబూబాబాద్, అక్టోబర్ 28(నమస్తేతెలంగాణ)/భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్/హనుమకొండ/జనగామ చౌరస్తా: ఉమ్మడి జిల్లాలో అదనపు కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. వరంగల్ డీఆర్‌వోగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎం విజయలక్ష్మి నియమితులయ్యారు. జీడబ్ల్యూఎంసీ సెక్రటరీగా పనిచేసిన ఆమె ఇక్కడకు వచ్చారు. వరంగల్ ఆర్డీవోగా కే సత్యపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన ములుగు నుంచి బదిలీపై వచ్చారు. నర్సంపేట ఆర్డీవోగా డిప్యూటీ కలెక్టర్ పీ ఉమారాణి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కృష్ణవేణి కుడా ఎస్‌డీసీగా బదిలీ అయ్యారు. డీఆర్‌వోగా విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలుగా సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద దేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ డీసీఎస్‌వోగా జనగామ ఆర్డీవో కొమురయ్య బదిలీ అయ్యారు. హనుమకొండ ఆర్డీవోగా రమేశ్ రాథోడ్‌ను నియమించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా భూసేకరణ స్పెషల్ కలెక్టర్‌గా నల్గొండ ఆర్డీవో ఎన్ రవి బదిలీపై వచ్చారు. మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మహేందర్ జీ బదిలీ అయ్యారు. ఈయన ములుగు నుంచి వచ్చారు. షాద్ నగర్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకట మాధవరావు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా బదిలీ అయ్యారు. మహబూబాబాద్ ఆర్డీవో అలివేలును గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా నియమించారు. ఈమె స్థానంలో జహీరాబాద్‌లో పనిచేస్తున్న ఎస్. రాజు మహబూబాబాద్ ఆర్డీవోగా వచ్చారు. అదేవిధంగా తొర్రూరు ఆర్డీవోగా ఖమ్మంలో పనిచేస్తున్న గుంటుపల్లి గణేశ్‌ను బదిలీ చేశారు. వీరందరు ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా నారాయణపేట్‌లో పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అశోక్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. వనపర్తి జిల్లా ఎస్‌డీసీ, ఎల్‌ఏ విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లును భూపాలపల్లి ఎస్‌డీసీ, ఎల్‌ఏగా నియమించింది. ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా మహబూబాబాద్‌లో పనిచేస్తున్న డేవిడ్‌ను బదిలీ చేసింది. ములుగు ఆర్డీవోగా ఇంకా ఎవరినీ నియమించలేదు. జనగామ ఆర్డీవోగా రంగారెడ్డి జిల్లాలో ఎస్‌డీసీ, యూఎల్‌సీ డిప్యూటీ కలెక్టర్ కే గోపీరాం బదిలీపై వచ్చారు.

# ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్స్

- అప్పుల బాధతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- హైదరాబాద్ ఘట్‌కేసర్‌లో ఘటన.. కడారిగూడెంలో విషాదం



బత్తిని గణేశ్(ఫైల్)

వర్ధన్నపేట, అక్టోబర్ 28 : ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడి అప్పుల పాలై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకోగా వరంగల్ జిల్లా కడారిగూడెంలో విషాదాన్ని నింపింది. తెలిసిన వివరాలిలా ఉన్నాయి. వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన బత్తిని గణేశ్ (20) హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ వద్ద ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గీత కార్మికుడైన గణేశ్ తండ్రి దేవేందర్ పదేళ్ల క్రితం తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. దీంతో గణేశ్ తల్లి సంధ్య ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కుమారుడితో పాటుగా కూతురును వరంగల్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివిస్తున్నది. కాగా, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన గణేశ్ తన స్నేహితుల వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అంతేకాక ఇటీవల దసరా పండుగకు కడారిగూడెం వచ్చిన గణేశ్ కళాశాలలో ఫీజు కట్టేందుకు తల్లి నుంచి రూ.80 వేలు తీసుకెళ్లి వాటిని కూడా ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన గణేశ్ సోమవారం కళాశాల సమీపంలో క్రిమిసంహారక మందు సేవించినట్లు తల్లి సంధ్యకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఘట్‌కేసర్ పోలీసుల సహకారంతో సోమవారం రాత్రి మృతదేహాన్ని కడారిగూడేనికి తీసుకువచ్చారు. కాగా, భర్త లేకపోయినా పిల్లల్ని కష్టపడి చదివిస్తుండగా, చేతికి అంది వచ్చిన కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి సంధ్య బోరున విలపిస్తున్నది.

రాయపర్తిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు



# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన
- రాయపర్తి మండల కేంద్రంలో ఘటన

రాయపర్తి, అక్టోబర్ 28 : తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ఘటన సోమవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్రూం గృహాల సముదాయం)కి కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై పలుమార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపిప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం ఖాళీ బిందెలతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మహిళలు రాస్తారోకో నిర్వహించారు. తమకు తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందికి ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. వెంటనే తమ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో కాలనీవాసులంతా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

# నేను డీఎస్పీని..

- భూ తగాదాను సెటిల్ చేసుకో..
- లేదంటే చంపుతా..
- బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ బెదిరింపు
- అరెస్ట్ చేసిన మడికొండ పోలీసులు



బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణచందర్

సుబేదారి, అక్టోబర్ 28 : 'నేను డీఎస్పీని.. మీ బాబాయ్‌లతో ఉన్న భూ తగాదాను సెటిల్ చేసుకో.. లేదంటే చంపుతా' అంటూ ఓ వ్యక్తిని బెదిరించిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కాజీపేట మండలం కొత్తపల్లికి చెందిన భూపతి హరీశ్‌కు, అతడి బాబాయ్‌లు భూపతి రమేశ్, సురేశ్, శ్రీనివాస్‌తో నాలుగేళ్లుగా భూ తగదా నడుస్తున్నది. ఈ విషయమై హరీశ్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కొక్కుల పూర్ణచందర్ ఈ నెల 22న కడిపికొండ కేంద్రీయ విద్యాలయం సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించాడు. అతడి బాబాయ్‌లతో ఉన్న భూ తగాదాను సెటిల్ చేసుకోవాలని బెదిరించాడు. అయితే పూర్ణచందర్ ఎవరనే విషయమై హరీశ్ ఆరా తీయగా బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ అని తేలింది. దీంతో సోమవారం బాధితుడు మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి పూర్ణచందర్‌ను అరెస్ట్ చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ పీ కిషన్ తెలిపారు. విచారణలో అతడు బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా తేలినట్లు ఆయన పేర్కొన్నారు.



డీబీఎం 31 పరిధిలో ఎండిపోయిన వరి పంట



పిచ్చిమొక్కలు పెరగడంతో చివరి వరకు రాని నీళ్లు

# చివరి ఆయకట్టుకు నీళ్లేవి?

- డీబీఎం 31 కాల్వ నిండా పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లు
- నీరందక ఎండుతున్న పంటలు

శాయంపేట, అక్టోబర్ 28 : శ్రీరాంసాగర్ జలాలపై ఆధారపడి సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయి. చివరి ఆయకట్టుకు నీళ్లు చేరకపోవడంతో చివరి తడి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శాయంపేట పరిధిలోని ఎస్సారెస్పీ డీబీఎం 31 ప్రధాన కాల్వ, 1ఆర్ ఉప కాల్వ మైలారం శివారు వరకు ఉంది. జూన్‌లో కాల్వ నీళ్ల ఆధారంగా రైతులు వరి పంటను సాగుచేశారు. శ్రీరాంసాగర్ జలాలు 1ఆర్ ఉప కాల్వ చివరకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. శాయంపేట శివారులో వరి పంటకు నీళ్లు అందక ఎండిపోతున్నట్లు రైతులు చెప్పారు. 15 రోజులకు ఒకసారి అరకొరగా కాల్వల్లో నీళ్లు రావడంతో తడి పెట్టుకున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండగా నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో కొద్దిపాటిగా వస్తున్న నీళ్లు బుంగ పడి వృథాగా పోయాయి. రైతులే సొంత ఖర్చులతో మరమ్మతులు చేసుకున్నట్లు చెప్పారు. మొరం తెప్పించి జేసీబీతో బుంగను పూడ్చేసినట్లు తెలిపారు. దీంతో వచ్చే అరకొర నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని వాపోయారు. కాల్వల నిండా తుమ్మ చెట్లు, పిచ్చిమొక్కలు, గడ్డి పెరగడంతో నీళ్లు చివరి వరకు రావడం కష్టంగా మారింది. కొన్నేండ్లుగా ఎస్సారెస్పీ అధికారులు కాల్వల పరిస్థితిని కన్నెత్తి చూసిన దాఖలాలు లేవంటున్నారు. మరికొంతమంది రైతులు వ్యవసాయబావుల నుంచి రూ. 2,500 చెల్లించి నీటిని కొనుక్కొని పారించుకుంటున్నట్లు చెప్పారు.